www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం 27 డిసెంబర్ 2022



'మాండూస్' బాధిత రైతులకు

నష్ట పరిహారం అందజేయాలి

కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-నెల్లూరు : 'మాండూస్' తుఫాన్ కారణంగా ఈ నెల 9వ తేది నుంచి 14వ తేది వరకు జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారులకు తుఫాన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లాలోని 11 మండలాల్లో 3,700 ఎకరాల్లో ఉన్న వరి నారుమళ్లు నీట మునిగాయన్నారు. తిరిగి నారుమళ్లు వేసుకొనేందుకు రైతాంగానికి 100 శాతం సబ్సిడీతో విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయాలన్నారు. ఇక 45 వేల ఎకరాల్లో వరిపైరు నీట మునిగి పాచిపోయి పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. ఉదయగిరి మండలంలో 450 ఎకరాల్లో పసుపు పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. ఈ పంటకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆయా రైతులను ఆదుకోవాలన్నారు. వలేటి వారి పాళెం, లింగసముద్రం, కందుకూరు, కలిగిరి, మర్రిపాడు, వరికుంటపాడు తదితర మండలాల్లో దాదాపుగా 2వేల 500 ఎకరాల పొగాకు పంట దెబ్బతిందన్నారు. ముత్తుకూరు, కావలి, ఉలవపాడు, ఇందుకూరు పేట తదితర ప్రాంతాల్లో 15 వందల ఎకరాల్లో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. ఈ రైతాంగానికి ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. పత్తిపంట 12 వందల ఎకరాల్లో, మినుముల పంట 6 మండలాల్లో12 వేల ఎకరాల్లో, మిర్చి 7 వందల ఎకరాల్లో, పప్పుశనగ 2 వేల 7 వందల ఎకరాల్లో దెబ్బతిన్నాయన్నారు. సంబంధిత రైతాంగానికి కారణంగా నష్టపోయిన పంట నష్టాన్ని అంచనావేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిరైతాంగానికి నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ రాజు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు శ్రీరాములు, పలువురు రైతు, వ్యవసాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రైతు సంఘాల నాయకులు

'బాబు' రాక టిడిపికి సవాల్..!

ముద్రోజులు జిల్లాలోనే మకాం - నాయకత్వానికి ప్రతిష్టాత్మకం

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మూడు రోజులు జిల్లా పర్యటన ఖరారైంది. ఎప్పుడో జిల్లాలో పర్యటన చేయాల్సింది. ప్రతి సారి తుపాను,వర్షాలు కారణంగా వాయిదా వేస్తూ వచ్చారు. ఈనెల 28,29,30 ముద్రోజులు కందుకూరు, కావలి, కోవూరు నియోజకవర్గాల్లో పర్యటన ఉండేలా టిడిపి నేతలు రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాపితంగా చంద్రబాబునాయుడు పర్యటన కొనసాగుతోంది. భారీగా జనం వస్తున్నారు. నెల్లూరు జిల్లాలో న్యాయకత్వ లోపం, ఒక్క ప్రజాప్రతినిధి లేకపోవడం, నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం వంటి కారణంతో నెల్లూరు బాబు పర్యటన ఎలా జరుగుతుందోనే అనుమానాలున్నాయి. నెల్లూరు సభ విజయవంతం చేయడానికి టిడిపి నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ సభల విజయవంతం కావడం బట్టే రాష్ట్రంలో ప్రజల నాడి తెలుస్తుందని చెబుతున్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 28,29,30తేదీలు మూడు రోజులు జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర వ్యాపితంగా చంద్రబాబు నాయుడు పర్యటన చేస్తున్నారు. విజయవంతం కావడంతో ఆపార్టీ నేతల్లో మంచి జోష్ కనిపిస్తోంది. నెల్లూరు జిల్లాలో పర్యటన కోసం అనేక దఫాలు సిద్ధమైనా ఏదొక కారణంతో వాయిదా పడుతూ వచ్చింది. బాబు పర్యటన నేపథ్యంలో ఆపార్టీ నేతలు విజయవంతం చేయడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. తొలి దశలో మూడు రోజుల పర్యటన కోసం ఈనెల 28న కందుకూరు నియోజకవర్గం, 29న కావలి నియోజకవర్గం, 30 కోవూరు నియోజకవర్గంలో ఆయన పర్యటన కొనసాగుతోంది. ఈ మూడు నియోజకవర్గాలు ఎంపిక చేయడం కీలకంగానే మారింది. ఇక్కడ ప్రతిష్టమైన న్యాయకత్వం లేదు. కందుకూరు నియోజకవర్గం నుంచి మాజీ ఎంఎల్ఏలు క్రియాశీలకంగా లేరు. ఇక్కడ నుంచి పార్టీ టికెట్ ఆశిస్తున్న ఇంటూరు నాగేశ్వరరావు, ఇంటూరు రాజేష్ ఆర్భాటంగా బాబు పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బాబు పర్యటన విజయవంతం చేయడం ద్వారా ఆయన దృష్టిలో పడాలని చూస్తున్నారు.కేవలం కందుకూరు పట్టణంలోనే కాకుండా నియోజకవర్గంలో బాబు పర్యటన కొనసాగనుంది. అటు తరువాత 29న కావలి నియోజకవర్గంలో టిడిపికి బలమైన న్యాయకత్వం లేదు. మాజీ ఎంఎల్ఏ బీద మస్తాన్‌రావు వైసిపికి వెళ్లిపోవడంతో సుబ్బానాయుడు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఇప్పుడు బీద రవిచంద్ర కీలకంగా మారారు. నియోజకవర్గం మొత్తం పర్యటనలు విజయవంతం చేయాల్సిఉంటుంది. ఎన్నికల తరువాత ఇన్‌యాక్టివ్‌గా ఉన్న నాయకులు, కార్యకర్తలు బాబు పర్యటనతో ఉత్సాహం పొందు తారని పార్టీలోకి క్రియాశీలంగా పనిచేస్తారని ఆపార్టీ నాయకులు అంటున్నారు. 30వ తేదిన కోవూరు నియోజకవర్గంలో బాబు పర్యటన ఉంటుంది. మాజీ ఎంఎల్ఏ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆయన తనయుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని రంగంలోకి దింపారు. వచ్చే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థిగా ఉంటారని ప్రచారం సాగుతోంది. ఇక్కడ నాయకత్వ లోపం కనిపిస్తోంది. మూడు నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం లేకపోవడం, అదే నియోజ కవర్గాల్లో బాబు పర్యటన ఉండడంతో జిల్లా నాయకత్వం ఆయన పర్యటన మీద పనిచేస్తు న్నారు. జిల్లాలో బాబు పర్యటన పైనే టిడిపి గాలి ఉంటుందని ఆపార్టీ నేతలంటున్నారు. బాబు పర్యటన ఎలా సాగుతుందో చూడాలి.

బాబు పర్యటన ఇలా సాగుతోంది..!

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి నేత చంద్రబాబునాయుడు మూడు రోజుల పర్యటన ఖరారైంది. ఈనెల 28న ఉదయం 10 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 3 గంటలకు సింగరాయకొండ వద్ద బాబు పర్యటన ఉంటుంది. అక్కడ నాయకులు స్వాగతం పలుకుతారు. అక్కడ నుంచి 7.30 గంటలకు కందుకూరు వరకు సాగు తోంది. రాత్రి అక్కడే బస చేస్తారు. 29 సాయం త్రం 4 గంటలకు కావలి నియోజకవర్గంలోని ప్రవేశిస్తారు. రాత్రికి కావలిలో బస చేస్తారు. 30 వతేది 4 గంటల కోవూరు నియోజకవర్గంలోని నార్త్‌రాజుపాళెంలో ప్రవేశిస్తారు. రాత్రికి కోవూరు నియోజకవర్గంలోనే బస చేస్తారు. మూడు రోజుల పర్యటనను విజయ వంత చేసేలా ఆపార్టీ శ్రేణులు పనిచేస్తున్నారు. బలమైన న్యాయకత్వం లేని నియోజకవర్గంలో బాబు పర్యటన ఏలా సాగుతుందో చూడాలి.



నారా చంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ అధ్యక్షులు

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎన్‌డబ్ల్యుఎఫ్ నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు

ఆర్టీసి స్థలాలను అన్యాక్రాంతం కాకుండా అడ్డుకుంటున్న బాపట్ల ఆర్టీసి డిఎం ను అక్రమ బదిలీని నిరసిస్తూ సోమవారం నగరంలోని ఆర్టీసి 2 డిపో ఎదుట ఉద్యోగులు, కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సంస్థకు చెందిన స్థలాలను కొందరు వ్యక్తులు కబ్జాలు చేస్తుంటే అభ్యంతరం తెలియజేయడంతో ఆకారణంగా ఉన్నతాధికారులు ఇటువంటి బదిలీలు చేయడం దారుణమన్నారు. ఈ అక్రమ బదిలీని ప్రభుత్వం రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులను కలుపుకొని ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఎన్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు, డిపో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పంట నిల్వలకు సెంటర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-నెల్లూరు రైతులు తాము పండించిన పంటను నిల్వ చేసుకొనేందుకు, గ్రేడింగ్ చేసుకొనేందుకు,సరైన మార్కెట్ ధరకు విక్రయించుకొనే విధంగా జిల్లాలోని 9 మండలాల్లో కలెక్షన్ సెంటర్ల నిర్మాణం జరుగు తుందని డిఆర్‌డిఎ పిడి కె.వి. సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని డిఆర్‌డిఎ కార్యా యంలోని పిడి ఛాంబర్‌లో రైతు ఉత్పత్తి దారుల ఆర్గనైజేషన్ సమితి (ఎఫ్‌పిఓ) సమీక్షనిర్వహించారు. ఈ సమావేశానికి 33 మండలాలకు చెందిన ఎఫ్‌పిఓ సిబ్బంది హాజరయ్యారు. ఈ సమావేశంలో పిడి మాట్లాడుతూ ప్రతి మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు, పిఎఫ్ ఫండ్ రికవరీ వంద శాతం చేయాలన్నారు. ఏపిఎం, హార్టికల్చర్ డిహెచ్ఓ,డిపిఎం, ఎపిఎంఎస్,సిసిలు,బిఓడి సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాంబశివరావు

అర్హులందరికీ పింఛన్లు : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : అర్హులందరికీ పింఛన్లు వస్తాయని, పింఛన్లు రద్దు అయిన వారి అభ్యర్ధనలు క్షుణ్ణంగా పరిశీలించి వచ్చే జనవరి 5వ తేదీలోగా నివేదికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో సంయుక్త కలెక్టర్ రోణంకి కూర్మానాథ్, డిఆర్ఓ వెంకటనారాయణమ్మలతో కలిసి కలెక్టర్ వై యస్ ఆర్ పింఛన్ కానుక, నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు, మాండూస్ తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటల అంచనాలు తయారీ, విత్తనాల పంపిణీ, వైయస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాలు, స్పందన అర్జీల పరిష్కారం, కోర్టు కేసుల పరిష్కారం తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరంకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెల మూడు లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.80 కోట్ల మేరకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.దాదాపు 12 వేల మంది పింఛనుదారులను అనర్హులుగా గుర్తించడం జరిగిందని, వారందరికీ తప్పని సరిగా నోటీసులు వెంటనే జారీ చేయాలన్నారు. కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలను స్వీకరించారు. నుడా వైస్ చైర్మన్ టి బాపిరెడ్డి, టిజిపి ప్రత్యేక కలెక్టర్ ఎం.వి సుధాకర్, డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి -రాపూరు : రాపూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యా ర్థులకు ఉచిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎంఎల్‌ఎ ఆనం రామ నారాయణరెడ్డి పాల్గొన్నారు. పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థానం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు.

పింఛన్లు తొలగిస్తే ఆందోళన : టిడిపి

ప్రజాశక్తి -వెంకటాచలం : కుంటి సాకులతో అర్హుల పింఛన్లు తొలగిస్తే ఆందోళనకు దిగుతామని టిడిపి వెంకటాచలం మండల అధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు పింఛన్ నగదు రెట్టింపు చేసి అందించిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు బద్వేలు చెన్న కష్ణయ్య, తెనాలి రమణయ్య, పఠాన్ ఖయ్యూమ్ ఖాన్, బత్తల రఘురామయ్య, అరుముళ్ల రమణయ్య, మందల మణి, వలిపి వెంకటేశ్వర్లు, తాటిపర్తి వేణు, నలబాలపు వెంకటాద్రి, షేక్ మస్తాన్, పి నరేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజా యాదవ్

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : పేదలకు ఆపన్నహస్తం అందించాల్సిన అవసరముందని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మెన్ చక్కా వెంకట కేశవరావు పేర్కొన్నారు. ఆకలితో ఉన్న వారి ఆకలి తీరుద్దాం వారి కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతో నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చక్కా వెంకట కేశవరావు పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో సోమవారం విప్పగుంట రోడ్డులో ఉన్న పేదవారికి ఆహారం, పండ్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇన్నమూరి శ్రీను,చీదెళ్ళ కష్ణ, చక్కా చైతన్య గుప్తా పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు : ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఈనెల 28వ తేదీన పట్టణంలో జరిగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనను జయప్రదం చేయాలని పట్టణ తెలుగుదేశం పార్టీ ముస్లిం నేతలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాల యంలో వారు సమావేశం నిర్వహిం చారు. పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం ఆధ్వర్యంలో నేతలు సమావేశమై జన సమీకరణ పై చర్చించారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయా ంలో దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, మైనారిటీలకు రుణాలు, విదేశీ విద్య లాంటి ఎన్నో పథకాలను అమలు చేసి ముస్లింలకు ఎంతో మేలు చేశారని అన్నారు. జగన్మో హన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ పథకాలన్నీ నిలిపివేశారన్నారు. రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నియోజకవర్గ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, నెల్లూరు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి రూబీ, నియోజకవర్గ ఐటీడీపీ కోఆర్డినేటర్ షేక్ మున్నా, ఖలీల్, నజీర్, 2వ వార్డు అధ్యక్షుడు నాగూర్, నియోజకవర్గ మైనార్టీ సెల్ కార్యదర్శి షరీఫ్, షాకీర్, మాబాషా పాల్గొన్నారు.

అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు 'సోమిరెడ్డి'

ప్రజాశక్తి -కందుకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దమ్ము ఉంటే అప్పులపై శ్వేత పత్రం విడుదల చేసి ఎవరి ప్రభుత్వ హయాంలో అప్పులు ఎక్కువ చేశారో తేల్చాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సవాల్ విసిరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టిడిపి ప్రభుత్వ హయాంలో కంటే తమ ప్రభుత్వమే అప్పులు తక్కువ చేసిందని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పు ఎంత చేశారో తెలవాలంటే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. రూ. 9 లక్షల కోట్లు ప్రభుత్వం అప్పులు చేసిందని తెలిపారు. లక్ష 65 వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింద న్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల ముంచేశారని ఆయన విమర్శించారు. రాష్ట్రం చెడు విషయంలో నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. మంచి విషయంలో రాష్ట్రం అధ్వాన స్థితిలో ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్కడ పర్యటనకు వెళ్లిన జనం నీరాజనం పడుతున్నారన్నారు. ఈ నెల 28వ తేదీ కందుకూరు, 29న కావలి, 30న కోవూరు కోవూరు నియోజకవర్గాల్లో పర్యటిసా ్తరన్నారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అవలం బిస్తున్న విధానాల కారణంగా ప్రజలు ఇసుకెత్తిపోయారన్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు లో జరుగుతున్న చంద్రబాబు నాయుడు పర్యటనను 40వేల మందితో జరిగే విధంగా ప్లాన్ చేశామన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నేతలు మాట్లాడారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర , బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన రెడ్డి, ఎంఎల్‌సి మంతెన సత్యనారాయణ రాజు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు దివి శివరాం, గూటూరు మురళి, కన్నబాబు, నియోజకవర్గ పరిశీలకురాలు కుసుమ కుమారి, కందుకూరు పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు ఉన్నారు.

ఉపకార వేతనాలను పునరుద్ధరించాలి : ఆవాజ్

ప్రజాశక్తి నెల్లూరు

మైనారిటీ స్కాలర్‌షిప్పులను పునరుద్ధరించాలని ఆవాజ్ నగర , రూరల్ కమిటీలు డిమాండ్ చేశాయి. సోమవారం ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో అర్బన్ తహశీల్దార్‌కు ఆవాజ్ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో రూరల్ తహశీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆవాస్ కమిటీ నాయకులు మాట్లాడుతూ మైనారిటీలు చదువుల విషయంలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఈ విషయం గతంలో రంగనాథ్ మిశ్రా కమిటీ, సచార్ కమిటీలు నివేదికలు స్పష్టం చేశాయన్నారు. ఆ రిపోర్టులను పక్కన పెట్టి ప్రస్తుతం కేంద్రం 1 నుంచి 8వ తరగతి వరకూ ఇస్తున్న ప్రీమెట్రిక్ స్కాలర్షిప్లను రద్దు చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర మైనార్టి మంత్రి స్మృతి ఇరానీ ప్రకటించడం దారుణం అన్నారు. ఈ ప్రీమెట్రిక్ స్కాలర్షిప్లను, మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ లు తీసివేయడం వలన చాలా మంది మైనారీలు విద్యకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి ప్రీమెట్రిక్ స్కాలర్షిప్లను , మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ లు గతంలో లాగే విద్యార్థులకు వచ్చే విధంగా కషి చేయాలని కోరారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్ డి రఫీ అహ్మద్, రూరల్ కార్యదర్శి ఎస్ డి రూరల్ అధ్యక్షులు ఎస్.కె నజీర్ ఆవాజ్ నాయకులు ఎస్.కె రషీద్, ఎస్ డి రవూఫ్, ఎస్ చాన్ భాషా, ఎస్.కె ఉస్మాన్ పాల్గొన్నారు

వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ నాయకులు

అర్జీలకు పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆశయాలతో నిర్వహిస్తున్న స్పందన వేదికలో అందే ఫిర్యాదుల పరిష్కారంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల సిబ్బంది నిబద్ధత పాటించాలని, నిర్దేశించిన సమయంలోపు సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ హరిత అధికారులకు సూచించారు. కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన వేదికలో ఫిర్యాదుదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించి గడువులోపు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగర వ్యాప్తంగా వీధి దీపాలు అంతరాయం లేకుండా వెలిగేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ జిల్లా శాఖ 2023వ సంవత్సరం టేబుల్ క్యాలెండర్ ను కలెక్టర్ కెవిఎన్ చక్రదర్‌బాబు ఆవిష్కరిం చారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి. పెంచలరావు, కార్యదర్శి నాయుడు. వెంకటస్వామి, అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం.ఆంజనేయ వర్మ, కోశాధికారి బండారుపల్లి. వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకష్ణ, ఉపాధ్యక్షులు ఈ. కరుణమ్మ,యన్. మధు,డి. కష్ణంరాజు, ఎవి కష్ణకుమార్, సంయుక్త కార్యదర్శులు యల్. పెంచలయ్య, సంయుక్త కార్యదర్శి మహిళా జి.సువర్ణ, నెల్లూరు నగర అధ్యక్షులు సీహెచ్. రామకష్ణ రెడ్డి,అసోసియేట్ అధ్యక్షులు కె. స్వర్ణలత, ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు సంయుక్త కార్యదర్శి షేక్. షంషుద్దీన్, డిఇసి మెంబర్లు ఎం చెంచయ్య, మస్తానయ్య, రాధాకష్ణ మొదలగువారు పాల్గొన్నారు.

పింఛన్లు రద్దు చేయొద్దు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు : కార్పొరేషన్ పరిధిలోని నిరుపేదలైన మూడు వేల మంది పింఛన్లు రద్దు చేయడం సరికదని యథాతథంగా పింఛన్లు పంపిణీ చేయాలని రూరల్ డివైఎఫ్ఐ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కార్పోరేషన్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో రద్దు చేసిన పేదల పింఛన్లు యధాతథంగా ఇవ్వాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ రూరల్ కమిటీ కార్యదర్శి కండె కోటేశ్వరరావు మాట్లాడారు. అధికారులు స్పందించి రద్దు చేసిన పింఛన్లను లబ్దిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సోమవారం సిపిఎం పట్టణ కమిటీ నాయకులు పరిశీలించారు. సుమారు 600 పేషెంట్లు వచ్చారు. ప్రతిరోజు సుమారు 400 మంది తగ్గకుండా ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వస్తున్నారు. ఆస్పత్రిలో మెరుగైన వస తులు కల్పించాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సిబ్బంది కొరతను తీర్చాల న్నారు. మురగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాల న్నారు. ఆహారం శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయాలని, కార్మికుల సంఖ్య పెంచాలని ఈ సమస్యలతో కూడిన అర్జీని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అందజేశారు. బృందంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ ఏ గౌస్ , నాయకులు ఎస్ కె మునువర్ సుల్తానా, ఎం ప్రసాద్ ,ఎం పద్మ ,అరుణ్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు అంకమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణం కోసం శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతుంది. యాత్రికులు అమ్మవారి ఆలయానికి తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మంచిరాజు వెంకట మురళీ మోహన్ భార్య చెంగాళ అపర్ణల చిన్న కుమారుడు శ్రీ హర్ష రూ.101116 అందజేశారు. ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాధవరావు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలోని కలిగిరి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న చిట్టేటి సుష్మి అంతర్జాతీయ స్థాయిలో మూడు నిమిషాల ఎన్యూరెన్స్ రోప్ జంప్ పోటీలలో భారతదేశం తరపున పాల్గొని వెండి పథకాన్ని కైవసం చేసుకొని దేశ ఘనతను చాటింది. జూలై నెలలో జాతీయస్థాయిలో కర్ణాటక రాష్ట్రం హొసా పేట లో నిర్వహించిన ఈ రోప్ జంప్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించడం వల్ల నవంబర్ నెలలో థాయిలాండ్ దేశంలోని బ్యాంకాక్ ప్రాంతంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు దేశం నుంచి హాజరైంది. ఈ పోటీలలో విశేష ప్రతిభను చూపి వెండి పథకాన్ని భారతదేశానికి సాధించి పెట్టింది. కలిగిరి మండలానికి చెందిన పడమటి గుడ్లదొన గ్రామానికి చెందిన చిట్టేటి శ్రీనివాసులు, సుమలతల సంతానం సుష్మి. ఈ సందరంగా సుష్మిని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో

'శ్రీ చైతన్య' జయకేతనం

ప్రజాశక్తి -నెల్లూరు : విక్రమ్ సింహపురి యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో కష్ణ చైతన్య కళాశాల విద్యార్థులు అన్ని కోర్సుల్లోనూ, గ్రూపుల్లోను యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి విజయఢంకా మ్రోగించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ ఆర్. వి. కష్ణారెడ్డి పి. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్సి, బికాం, బిబిఎ, బిసిఎ కోర్సుల్లో అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. 12 మంది విద్యార్థులకు 99శాతం పైగా మార్కులు సాదించారన్నారు. 23 మంది విద్యార్థులకు 98 శాతం పైగా మార్కులు సాధించారన్నారు. 121 మంది విద్యార్థులు 95 శాతం మార్కులు సాధించా రన్నారు. 384 మంది విద్యార్థులకు 90 శాతానికి పైగా మార్కులు సాధించా రన్నారు. 1048 మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. గణితంలో 269 మంది, స్టాటిస్టిక్స్ లో 159 మంది అకౌంట్స్ లో పదిమంది ఫిజిక్స్ లో 27 మంది ఎలక్ట్రానిక్స్ లో పది మంది కెమిస్ట్రీలో 11 మంది బయోటెక్ ముగ్గురు విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులు సాధించారన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు సాంకేతి పరమైన అంశాలను విసదీకరిస్తూ నిరంతరం పర్యవేక్షణ చేయడం వల్ల ఇంతటి ఘన విజయాలను సొంతం చేసుకోగలిగామని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ ఆర్. వి. కష్ణారెడ్డి పి. చంద్రశేఖర్ రెడ్డి డిన్ బి. సుధారాణి అడ్మిన్ సి. రామాంజనేయులు రెడ్డి ప్రిన్సిపల్ ఎస్. నాగయ్య వైస్ ప్రిన్సిపల్ అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - రాపూరు

మండలంలోని అఖిల వరుస గ్రామంలో గడపగడపకు మన. ప్రభుత్వం కార్యమ్రకం జరిగింది. ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలు అభివద్ధి పనుల గురించి ఆయన వివరించారు. గుండవో లు, రేగడపల్లి పునరావాస కేంద్రాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురి నుంచి ఆయన సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

సిపిఐ వార్షికోత్సవ వేడుకలు

నెల్లూరు : స్థానిక సంతపేటలోని సిపిఐ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. అర్బన్ బ్యాంక్ చైర్మన్ అరిగేలా సాయి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, అజీజ్ అహ్మద్, మున్నా, కిషోర్, నాగేంద్ర, వాహనాల మధు, గయాజ్, గౌస్, స్టాలిన్, సర్దార్, అజయ్, షాకీర్, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు

కందుకూరు : అనగారినర్గాలకు అండగా నిలుస్తూ సుదీర్ఘ చరిత్ర లో ఎన్నో విజయాలు సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందని సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు పేర్కొన్నారు. సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం కందుకూరు నియోజకవర్గంలో నిర్వహించారు సురేష్ బాబు మాట్లాడారు. కార్యమ్రకంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి మాలకొండయ్య మాట్లాడారు. ఎఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, సిపిఐ నాయకులు నత్తా రామారావు, డి.ఆదినారాయణ, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు చేవూరి దుర్గాప్రసాద్, బొజ్జ చంద్రమోహన్, యువజన నాయకులు నీలి శెట్టి కష్ణబాబు, శ్రీకాంత్, దాసరి వెంకటరావు ,హరిబాబు, సిపిఐ నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మాచారి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి: కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో సోమవారం కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఈనెల 29వతేదీ కావలికి విచ్చేయుచున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. అదేవిధంగా జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్టే సమయం ఆసన్నమైందన్నారు. “ఇదేమి కర్మ రాష్ట్రానికి “అనే కార్యక్రమంతో ప్రజలతో మాట్లాడేందుకే చంద్రబాబు కావలికి వస్తున్నారని, కావలి నియోజకవర్గంలోని ప్రజలందరూ ఏకమై 29వ తేదీ సా.4.00 గంటలకు కావలి పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు చేరుకొని చంద్రబాబు నాయుడు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులు పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి ,మాజీనెల్లూరుమున్సిపల్ చైర్మన్, తాళ్లపాక అనురాధ, రాజా నాయుడు, తిరుమల నాయుడు, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి: విద్య నుండే అభ్యసనలో సాంకేతిక పరిజ్ఞానం అలవరచాలని ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి ప్రారంభించారని ప్రధానోపా ధ్యాయులుజి. వెంకటేశ్వర్లు చైర్మన్ సి హెచ్. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అప్పసముద్రం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందుండాలనే ఆలోచనతో ప్రతిష్టాత్మకంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా తేది 21 న ముఖ్యమంత్రి లాంచనంగా ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి 22 న విద్యార్థులకు అందజేశారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అప్పసముద్రం, ప్రాథమిక ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులతో ట్యాబ్‌లను అందజేశామన్నారు. అనంతరం వాటి ఉపయోగాలను విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు అందజేస్తున్న చైర్మన్

సైకిల్ యాత్రకు బయల్దేరిన యువకుడు

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్: భారత్ సైకిల్ యాత్రను రెండవసారి మన నెల్లూరు జిల్లా వాసి గుర్రం చైతన్య ప్రారంభించారు. సోమవారం ఆత్మకూరు పట్టణం సత్రం సెంటర్ వద్దకు రావడం జరిగింది. ఆయన పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం చైతన్య 5వేల కిలోమీటర్లు నెల్లూరు నుంచి కన్యాకుమారి వరకు నెల్లూరు నుంచి పాకిస్తాన్ బార్డర్ వరకు సైకిల్ యాత్ర చేశాడు. ఈ సారి ఆయన ముఖ్య ఉద్దేశం 50 వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేసి గిన్నిస్ బుక్ రికార్డులలో కి ఎక్కాలని కోరిక.సాగనంపిన వారిలో కుడుముల సుధాకర్ రెడ్డి, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

స్వాగతం పలుకుతున్న దృశ్యం

సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: సిపిఐ 98వ ఆవిర్భావ దినోత్స సందర్భంగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆత్మకూరు నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తాడిత పీడిత వర్గాల అభ్యున్నతి కోసం, ప్రథమంగా స్వాతంత్ర్య సముపార్జన కోసం 1925 డిసెంబర్ 26వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. నాటినుండి నేటి వరకు అనేక పోరాటాల ద్వారా దేశవ్యాప్తంగా నెలకొని ఉన్న అనేకానేక సమస్యల పరిష్కారం జరిగిందని, తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. నాగరాజు, మున్సిపల్ టౌన్ కార్యదర్శి బి. హజరత్తయ్య, సిపిఐ నాయకులు శేషాద్రి, చెంచయ్య, నాగేంద్ర, వాసు, ఎస్ వెంకటేశ్వర్లు, షఫ, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

కావలి

జలదంకి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 98 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నెహ్రూ నగర్ లో సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించిన ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు .ఆవిష్కరించారు.భారత దేశంలో 1925 డిసెంబర్ 26 తేదిన కాన్పూరులో కమ్యూనిస్టు పార్టీని స్థాపించటం జరిగింది.

విద్యాభివృద్ధికి పెద్దపీట

ప్రజాశక్తి-ఉదయగిరి: విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి జగనన్న ప్రభుత్వం ఎనిమిది తరగతి విద్యార్థులకు ట్యాబ్ లను అందజేయడం సంతోషదాయకమని ప్రధానోపాధ్యా యులు గాజుల ఫారుఖ్ అలి, సర్పంచ్ సయ్యద్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని దాసరపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉన్నతి అధికారుల ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి అందజేసిన ట్యాబ్ లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్యాబ్ లతో తాప్సి ఆర్టి సిలబస్ ప్రకారం ఇంగ్లీష్ మీడియం లో చక్కటి కంటెంట్ ఇవ్వడం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు దేవుడిచ్చిన మామకాని మామ జగన్ మోహన్ రెడ్డి వరమని కొనియాడారు. విద్యారంగానికి జగనన్న విధ్యాకానుక, గోరుముద్ద, విద్యాదీవెన లాంటి ఎన్నో రకాల కార్యక్రమాలు దేశంలోనే తొలిసారిగా అమలు పరచటం పై వారు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం పదహారు మంది మైనారిటీ, దళిత విద్యార్థులు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఖాజామోహిద్దీన్, ప్రధాన ఉపాధ్యాయులు షేక్ గాజుల ఫారుఖ్ అలి ట్యాబ్ లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షమీమ్, హజరత్, షఫీ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు అందజేసిన దృశ్యం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: స్థానిక ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం నెల్లూరుకు చెందిన అభిషేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్వీస్ టు హిమానిటీ ఇస్సర్వీస్ టు గాడ్ మానవసేవయే మాధవసేవ అనే అంశంపై వ్యాసరచన పోటలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరు నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి వెయ్యి రూపాయలు, ద్వితీయ స్థానం రూ.500, తతీయ స్థానం సాధించిన విద్యార్థికి వంద రూపాయల నగదు బహుమతిని అందించడమే కాకుండా విద్యార్థులు అందరికీ సర్టిఫికెట్లు అందించారు. ఫౌండేషన్ అధినేత ఏ అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులలో సేవాభావం పెంపొందించాలన్నదే అభిషేకం ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సౌ రెడ్డి మాట్లాడుతూ ఈనాటి నుంచే విద్యార్థులందరూ సేవాభావాన్ని అలవరచుకోవాలన్నారు.కార్యక్రమంలో ఠాగూర్ పాఠశాల డైరెక్టర్ ప్రధానోపాధ్యాయులు కె. దొరస్వామి రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వి రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేసిన దృశ్యం

పింఛన్ల కోతపై బాధితుల ఆందోళన

బోరున విలపిస్తున్న బాధితులు అధికారులతో వాగ్వాదం

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని నార్త్ మోపూరు సచివాలయం వద్ద సోమవారం వద్ధులు,వికలాంగులు, వితంతువులు పింఛన్లలో కోత విధిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేయడంతో సమాచారం తెలుసుకుని బాధితులు అక్కడకు చేరుకుని ఆందోళన వ్యక్తపరిచారు. ఆ గ్రామంలో సుమారు 52 మందికి ప్రభుత్వ అధికారులు పలు కారణాలతో పింఛన్లు రద్దు చేసినట్లు వాలంటీర్లు తెలపడంతో ఇదేమి అన్యాయమంటూ గళమెత్తారు. అడ్డగోలుగా నోటీసులు ఇవ్వడంతో కార్యాలయం వద్ద బోరున విలపించారు. నోటీసులు అందుకున్న బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగి తమకు న్యాయం చేయాలని కోరారు. కుటుంబ పెద్దను కోల్పోయి తమకంటూ ఎలాంటి చర,స్థిర ఆస్తులు లేకపోయినా కూలి పనులు చేసుకుంటున్న తరుణంలో ప్రభుత్వం పిడుగు లాంటి వార్త అందించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాటలకు మోసపోయి ఓట్లు వేసినందుకు తగిన శాస్తి చేశారంటూ దుయ్యబట్టారు. పరిపాలన చేతగాక పేద ప్రజలకు చెందాల్సిన అనేక పథకాలను దోచుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నాయకుడికి త్వరలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన కొనసాగుతుందని దుయ్యబట్టారు. జగన్ అధికారం చేపట్టిన నాటినుండి రాష్ట్రంలో భారీగా విపత్తులు చోటుచేసుకున్నాయని వారంటున్నారు. రేషన్ కార్డులు చెల్లుబాటు కాక ఆరోగ్యశ్రీ అనారోగ్య శ్రీ గా మారిందిని వివరించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడుతూ జనవరి 1వ తేదీన అందరికీ పింఛన్లు వస్తాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదేశాల అనుసారం అధికంగా ఇళ్ల స్థలాలు, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు ఉంటే విచారించి ఫిబ్రవరి తొలగిస్తామన్నారు. నోటీసులు వచ్చినవారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులకు అన్ని వివరాలు వెల్లడించాలన్నారు. కావలి డిఎల్ డిఒ కనకదుర్గ భవాని సంబంధ విషయంపై విద్యుత్ ఏ డి,డిఇ లతో చర్చించి అందరికీ న్యాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆందోళన చేస్తున్న బాధితులు

మైనార్టీల స్కాలర్‌షిప్‌లను పునరుద్ధరించాలి

మర్రిపాడు

మర్రిపాడు

ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మైనారిటీ స్కాలర్ షిప్ లు పునరుద్దరించాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మండల ఉపాధ్యక్షులు రహంతుల్లా మాట్లాడుతూ మైనారిటీ విద్యార్థులు విద్య పరంగా చాలా వెనుక పడి ఉన్నారన్నారు.గతంలో రంగనాథ్ మిశ్రా, సచార్ కమిటీలు తమ సమాచారాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు.ఆ సమాచారాన్ని పక్కన పెట్టి కేంద్రం 1నుంచి 8వ తరగతి వరకు ఇస్తున్న ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లను రద్దు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించడం దారుణమన్నారు.ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ లు, మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ లు తీసివేయడం వల్ల చాలా మంది విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని, స్కాలర్ షిప్ లు పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. 2023 జనవరి 2న నెల్లూరులో జరుగు ప్రదర్శనకు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, ఆవాజ్ మండల కార్యదర్శి గౌస్ బాషా పాల్గొన్నారు.

బుచ్చిలో

కొడవలూరు

కేంద్ర ప్రభుత్వం మైనారిటీ స్కాలర్షిప్ రద్దు చేయడంపై ఆవాజ్ ఆధ్వర్యంలో బుచ్చి తహశీల్దార్ కార్యాలయం వద్ద మైనారిటీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మునీర్ అహ్మద్ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జానీ బాషా, జాయింట్ సెక్రెటరీ బాబు, నాయకులు నజీర్ బాషా, కరిముల్లా, షేక్ ఖాదర్ మోదిన్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో

అనంతసాగరం

మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో

ఎఎస్‌పేటలో

మైనారిటీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలు రద్దు చేయకూడని,ఉపకార వేతనాలు ఇవ్వాలని తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా ఆవాజ్ మండల అధ్యక్షుడు సయ్యద్ఇఫ్తిఖర్ మాట్లాడారు.కార్యక్రమంలో ఆవాజ్ మండల కమిటీ నాయకులు ఎస్‌కె సలీం, ఎస్‌కె. సుబహానీ, ఎస్‌కె. సైపు, అహిల్, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో

ఉదయగిరి

మైనారిటీ స్కాలర్ షిప్ ను పునరుద్ధరించాలి అవాజ్ కమిటీ మండల అధ్యక్షులు నాయబ్ డిప్యూటీ తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కి వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో సిఐటయిు అధ్యక్ష కార్యదర్శులు గడ్డం నాగేశ్వరరావు, తిరుప తయ్య, సిపిఎం మండల కార్యదర్శి ఫర్దీన్ బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోవూరు

మైనారిటీ స్కాలర్ షిప్ ను పునరుద్ధరించాలి అవాజ్ కమిటీ మండల అధ్యక్షులు చాన్‌బాషా తహశీల్దార్ పద్మజకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా

అనంతసాగరంలో

చాన్‌బాషా మాట్లాడారు.కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె బాబు, కాలేషా, కరీముల్లా, అఫ్రో, హుమాయున్, సరదా రహమాన్, జావిద్, అబ్దుల్లా, జానీ బాయ్, ఖాదర్ బాషా, అఫ్రోజు పాల్గొన్నారు.

ఎఎస్‌పేట

మైనారిటీ విద్యార్థుల స్కాలర్షిప్ లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలన్న నిర్ణయాన్ని నిరసిస్తూ సోమవారం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ పి.సుభద్ర కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆవాజ్ కమిటీ నాయకులు నిషర్ అహ్మద్ మాట్లాడుతూ మైనార్టీలు చదువుల విషయంలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. అనంతరం తహశీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా మండల కార్యదర్శి ఎం.నిసార్ అహ్మద్, సయ్యద్ గౌస్ బాషా, ఇలియాజ్, జిలానీ, మండల ఆవాజ్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మేత పోరం బోకు భూమి స్వాహా

గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-సీతారామపురం: రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1లోని సుమారు 438 ఎకరాల మేత ఫోరం బోకు ఉంది. ఈ భూమిని చాలా కాలంగా పశువుల మేతకు గ్రామస్తులు వాడుతున్నారు. మొత్తం మేత పోరంబోకు భూమిగా రెవెన్యూ రికార్డులలో సైతం ఉంది. అందులో దాదాపు 87 ఎకరాల మేత ఫోరం బోకు భూమి స్వాహా గురైందని గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు.కోర్టు ఆదేశాలంటూ ఈ నెల 24 వ తేదీన కొందరు కొనుగోలు దారులు రెవెన్యూ సిబ్బందితో భూమి వద్దకు రావడంతో గ్రామంలో అలజడి రేగింది. స్వాహాకు గురైన భూమిలో 47 ఎకరాల 98 సెంట్లు భూమి మా పేరుపై రిజిస్టర్ అయిందని మరో 40 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పనులలో ఉందని, మాపై రిజిస్ట్రేషన్ అయిన భూమిని చూపించాలని కొందరు రెవెన్యూ అధికారులను సర్వేయర్ ను తీసుకువెళ్లి కొలతలు వేయించారు. గ్రామంలో చర్చలు జరిగాయి. గ్రామస్తులు రెవెన్యూ అధికారులను వివరాలు అడగగా తనకేమీ తెలియదని మాట దాటవేయడంతో మరింత అనుమానాలు రేకెత్తాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సర్పంచ్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి తహశీల్దార్ షాజియా బేగం కు వినతి పత్రం అందజేశారు. ఈ భూ కుంభకోణంలో సుమారు రూ.6 కోట్లు చేతులు మారాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.భారీ స్థాయిలో రెవెన్యూ అధికారులకు ముడుపులు అందాయని ఆరోపణ లున్నాయి. గ్రామానికి చెందిన పశువుల మేత పోరంబోకు భూమికి ఎటువంటి పట్టాలు ఇవ్వరాదని కోరామన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

8న అఖిలపక్ష రైతు సదస్సు

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో సోమశిల హై లెవెల్ కెనాల్ పై అఖిలపక్ష రైతు సదస్సు పోస్టరును ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య ఆవిష్కరించారు. జనవరి 8న మర్రిపాడు లో మధ్యాహ్నం 2 గంటలకు జరుగు రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమశిల హై లెవెల్ కెనాల్ కు నిధులిచ్చి సత్వరమే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును మంజూరు చేయగా 2013లో టెండర్లు పిలిచి 2014లో పనులు ప్రారంభించారు. పదేళ్లు దాటిన మొదటి దశలోనే పడమటి నాయుడు పల్లి వద్ద నిర్మించాల్సిన ప్రధాన రిజర్వాయరుకు భూసేకరణ నేటికీ జరగలేదన్నారు. పడమటి నాయుడు పల్లి నుంచి భీమవరం రిజర్వాయర్ వరకు 13 కిలోమీటర్ల మేర ప్రధాన నీటి సప్లై కెనాల్ పూర్తి నిర్మాణం జరగలేదు. 2013లో ప్రాజెక్టు విలువ రూ.700కోట్లు కాగా తర్వాత రూ.1500 కోట్లకు పెంచారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తవ్వాలంటే రూ.2000 కోట్లు పైగా ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రాజెక్టు నిర్మాణం ఎప్పుడు పూర్తయ్యేదని అదే సమయంలోపనులు ప్రారంభించిన సంగం,నెల్లూరు ఆనకట్లు పూర్తయి ప్రారంభించారని గుర్తు చేశారు. ఆత్మకూరు ఉదయగిరి ఎమ్మెల్యేలైన మేకపాటి విక్రమ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి లు ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. కాంగ్రెస్ టిడిపి వైసిపి ప్రభుత్వ కాలాలలోనూ మొదటి దశ పూర్తి కాకపోవడం శోచనీయమన్నారు. గత నాలుగేళ్ల నుంచి కురిసిన వర్షపు నీరు జలాశయం నుంచి సముద్రం పాలైందన్నారు. అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే రైతు సదస్సును రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రహంతుల్లా, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, ఆవాజ్ మండల కార్యదర్శి గౌస్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పెన్షన్లు రద్దు చేయొద్దని రాస్తారోకో

ప్రజాశక్తి-కావలి: వికలాంగులు (మూగ, చెవుడు, కుష్టు, అంధులు, శారీరక, మానసిక వికలా ంగుల అర్థం,పర్థం లేని కుంటి సాకులతో పెన్షన్లు తీసివేయొద్దని కోరుతూ అఖిల భారత వికలాంగుల హక్కులవేదిక జాతీయ కార్య దర్శి మండవ వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం పట్టణ ట్రంకు రోడ్ వద్ద వికలాంగులు “రాస్తారోకో ”చేపట్టారు. ఈ సందర్భంగా మండవ వెంకటరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వికలాంగులను గుర్తించి ,వారికి దాదాపు రూ.3వేలు.పెన్షన్లు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత జగన మోహన్‌రెడ్డి ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ పథకాన్ని అపహాస్యం చేసి, నిబంధనలు విధించి, వికలాంగుల పెన్షన్‌తీసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కొత్త నిబంధనలు పేరుతో పెన్షన్లు తొలగించొద్దని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నాయకులు మహబూ బ్‌బాషా, బి.వేణు, గుడిగంట సురేష్, యు.రవి, తదితర వికలాంగులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతసాగరం: స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్లో శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి మంగళవారం ప్రభుత్వ పాఠ శాలల్లో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించు ఉచిత ట్యాబ్స్ పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ మధుసూదన్ రావు తెలిపారు. మండలంలో 8 వ తరగతి గల ఉన్నత ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇద్దరు లేక ముగ్గురు ఉపాధ్యాయులు 8వ తరగతి విద్యార్థులను తప్పక తీసుకురా వాలన్నారు. కార్యక్రమానికి జెడ్‌పిటిసి సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, తహశీలార్దు పాల్గొంటా రని తెలియజేశారు.

చంద్రబాబు ఫ్లెక్సీలు తీస్తే ఊరుకోం

ప్రజాశక్తి-కావలి: కావలిలో ఏర్పాటు చేసే చంద్రబాబు ఫ్లెక్సీలు మున్సిపల్ అధికారులు తొలగిస్తే తగ్గేదెలా అంటూ కమిషనర్ శివారెడ్డి పై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి పై విరుచుకు పడ్డారు. సోమవారం పట్టణంలో ఈనెల 29వ తేదిన “ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి “అనే కార్యక్రమానికి విచ్చేస్తున్న చంద్రబాబునాయుడు కార్యాక్రమానికి స్వాగతం తెలుపుతూ కావలిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఫ్లెక్సీలను కట్ట వద్దు అంటూ మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి అడ్డుకున్నారంటూ కమిషనర్ ఇంటిని తెలుగుదేశం నేతలు చుట్టుముట్టారు. అనంతరం కమిషనర్ తో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. డివైడర్‌లో కట్టకపోతే అభ్యంతరం లేదని కమిషనర్ తెలపడంతో మరి వైసీపీ నేతల ఫ్లెక్సీలు మీకు కనపడలేదా? వారికి ఒక రూల్!ఇంకొరికి ఒక రూల్ నా?అన్నారు. ఈ మధ్యకాలంలో ఫ్లెక్సీల వివాదంలో కమిషనర్ తరచు ఉండటం పరిపాటిగా మారిందని దుమ్మెత్తిపోసారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్, బాల గురు స్వామి, గొట్టిపాటి రాము పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-కొడవలూరు: బుచ్చి నగరపంచాయతీ 03 వార్డు కౌన్సిలర్ డాక్టర్ అందే ప్రత్యూష వార్డు సచివాలయ వెల్ఫేర్, కార్యదర్శులు, వలీంటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మౌలిక సదుపాయాల కల్పన తో పాటు రేషన్ కార్డులు, వద్ధాప్య పింఛన్లు, రేషన్ పంపిణీ, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణాలు తదితర సంక్షేమ పథకాల గురించి వారితో చర్చించడం జరిగింది.అనంతరం వార్డులో 27 వ తేదీ జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎక్కడైనా సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కావలి: స్థానిక రామ్మూర్తి పేట, దంతంవారివీధిలో ఉన్న “ఆనంద్‌హాస్పిటల్”లో మంగళవారం ఉదయం 10.00గంటల నుండి “ఉచిత వైద్యశిబిరం”నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కె.ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో దీర్ఘకాలంగా తగ్గని కీళ,వెన్నుముక, మోకాళ్ళ సమస్యలు, విషజ్వరాలు, సాధారణ జ్వరాలు, కడుపు నొప్పి, పిల్లలు లేనివారిసమస్యలు, థైరాయిడ్, పిల్లలకు సంబంధించిన అన్నిరకాల సమస్యలపై వైద్యపరీక్షలు చేస్తారని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం లోని చెంచులక్ష్మి పురం గ్రామంలో సోమవారం కాంద్ర సతీష్ నాయుడు యువ నేస్తం ద్వారా నిరుపేద గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా బాపట్ల వెంకటపతి పాల్గొని నిరుపేద గిరిజన కుటుంబాలకు దుప్పట్లు అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. సమాజంలో కోట్లు గడించిన వారు ఎందరో ఉన్నప్పటికి పేదవారికి సహాయం చేయాలన్న ఆలోచన కొందరికే పరిమితమన్నారు. వారిలో కాంద్ర సతీష్ నాయుడు వంటి వారు చలికాలం చలి కాలంలో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి ఈ విషయాన్ని వారి దష్టికి తీసుకొని పోగా వెంటనే వారు స్పందించి పేదప్రజలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో జయ ంపు అశోక్, పీట్ల ప్రత్యూ ష్, రాచగిరి వెంకటే శ్వర్లు, ప్రాంక్లిన్. స్థానిక గిరిజన నేతలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మాదక ద్రవ్యాలు వాడడం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని వాటిని దూరంగా ఉంచాలని ఆత్మకూరు ఎస్ఇబి ఎస్ఐ మొగల్ బాబు పేర్కొన్నారు సోమవారం ఆత్మకూరు ఎస్ఇబిసి ఐ నయనతార ఆదేశాల మేరకు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు వాడడం వల్ల కలిగే నష్టాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు వాడడం వల్ల వచ్చే నష్టాలు కలిగే అనర్థాలు గురించి వివరించారు. విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

రశీదులివ్వాలి

ప్రజాశక్తి- కావలి: డివిజన్‌లోని రైతులకు చెందిన అన్ని పొలాలకు “ఈక్రాప్” చేయించి, రశీదులివ్వాలని కోంంతూ వ్య వ సాయకార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యా లయంలో ఆర్‌డిఒ వి.కె.శీనా నాయక్‌కు వినతి పత్రం నమర్పించారు. ఈసందర్భంగా వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ళూరు మాల్యాద్రి మాట్లాడుతూ ఈక్రాప్‌కు ఎక్కితేనే సైతుంబరోసా, నంన్నావడ్డీ, విత్తనసబ్సిడీ ఇన్‌పుట్‌సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంటరుణాలు, చివరికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంటను రైతులు అమ్ముకోవాలన్నా ‘ఈక్రాప్’అవసరమని ప్రభుత్వం తెలియజేస్తుందన్నారు. కిందిస్థాయిలో ‘ఈక్రాప్’పార దర్శకత ప్రశ్నార్థకంగా తయారైందన్నారు.

మాట్లాడుతున్న మాల్యాద్రి

శ్రీ సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

దావా నెంబరు : 94/2021

M/s. Comphor Shoes India Pvt Ltd.,
Rep by its Manager, Apache SEZ, Mambattu, Tada Manadal, Tirupati Dist. ... వాది
M/s. K.G.N. Traders
Rep by Sole Properietor, SD Shafi, ... ప్రతివాది
Ramakotaiah Nagar, Koturu (Vi), Nellore Rural & Mandal, SPSR Nellore Dist.

ఆక్షేపణ నోటీసు

ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా పై వాది మీ మీద దావా వేసి మీకు పలుమార్లు నోటీసులు పంపినను జారీ కానందున పై శ్రీ కోర్టు వారు మీకు నోటీసులను జారీ చేయమని కోరుతూ, మీ హాజరు నిమిత్తం వాయిదా తేదీ 03.01.2023న వేసియున్నారు. కావున మీరు ఆ రోజు ఉదయం10.30 గం॥లకు హాజరై మీకున్న ఆక్షేపణలను స్వయంగా గానీ, మీ ప్లీడరు ద్వారా గానీ తెలుపుకొనవచ్చును. లేనిచో మీకు పరోక్షముగా ఏమియూలేదని పై దావాలో కోర్టు వారు తీర్మానించెదరు.

P.D. BALARAJU, B.A., LL.B.,
Adcocate, Sullurpeta, Tiruapti District.

మహారాజశ్రీ కోవూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No : 14 / 2019
A.S. No : 14 / 2012

మాతంగి లక్ష్మయ్య – పిటిషనర్ / అప్పిలెంట్
Vs
కుడుముల మీరయ్య వగైరా – రెస్పాండెంట్లు
To
R8.కుడుముల పద్మశ్రీ, తండ్రి లేట్ మీరయ్య, మిలటరీ కాలనీ, కొండాయపాలెం గేట్, నెల్లూరు.

పై నంబర్న మీ తల్లి గారైన తిరుపతమ్మ (R3) చనిపోయినందున మిమ్ములను ఆమె తరపు వారసులరాలిగా పై నంబరు అప్పీలు నందు 8వ రెస్పాండెంట్‌గా చేర్చమని కోరుచూ పిటిషనర్ పిటిషను దాఖలు చేసియున్నందున మీ నోటీసు నిమిత్తం తే 28.12.2022 ది కు వాయిదా ఉన్నది. వాయిదా నాడు ఉదయం 10.30 నిమిషములకు మీరు గాని మీ తరపు వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

జి. శేషమ్మ, బి.ఎస్‌సి., బి.ఎల్.,
అప్పిలెంట్ తరపు వకీలు

మహారాజశ్రీ కోవూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No :13 /2019
A.S.No : 14 / 2012

మాతంగి లక్ష్మయ్య – పిటిషనర్ / అప్పిలెంట్
Vs
కుడుముల మీరయ్య, వగైరా – రెస్పాండెంట్లు
To,
R8. కుడుముల పద్మశ్రీ, తండ్రి లేట్ వీరయ్య, మిలటరీ కాలనీ, కొండాయపాలెం గేట్, నెల్లూరు.

పై నంబర్న మీ తల్లి గారైన తిరుపతమ్మ చనిపోయినందున ఆమె తరపు వారసులిగా మిమ్ములను చేర్చుటలో సకాలంలో జరగ నందున తే.14.7.2018 దిన జరిగిన Abatement ను రద్దు పరచమని కోరుచూ పిటిషనర్ పిటిషను దాకులు చేసియు న్నందున మీ నోటీసు నిమిత్తం తే.28.12.2022 దికు వాయిదా ఉన్నది వాయిదా నాడు ఉదయం 10.30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని మీ తరపు వకీల్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును

జి. శేషమ్మ, బి.ఎస్‌సి., బి.ఎల్.,
అప్పిలెంట్ తరపు వకీలు